# బామ్మగారి రికార్డ్

అలనాడు అక్కినేని నాగేశ్వరరావు నటించిన "దొంగరాముడు" సినిమా జ్ఞాపకం ఉందా? ఆ రాముడి ఊరు జంబూక రంధ్ర అగ్రహారం. అనగా అచ్చ తెలుగులో నక్కబొక్కలపాడు! దొంగరాముడు అలా తన గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చాక ఎవరూ ఆ గ్రామాన్ని తర్వాత పట్టించుకోలేదు. ఆ పేరు మళ్ళీ ఎక్కడా వినిపించలేదు. ఆ గ్రామం మరీ కాకులు దూరని బండల గ్రామమే! బళ్ళూ, సైకిళ్లే ఆ గ్రామానికి బాహ్య ప్రపంచంతో లింకు.

అలనాడు దొంగరాముడు ఆ గ్రామానికి కీర్తి మూటకట్టి యిస్తే ఇప్పుడు రావిపల్లి రామారావు, పోకల రాము ఆ గ్రామానికి యథాశక్తి కీర్తిమూట తెచ్చిపెట్టే పనికి బెల్టులతో నడుములు బిగించుకున్నారు.

ఆ గ్రామంలో రావిపల్లి రామారావుని రారా అని, పోకల రాముని పోరా అనీ పిలుస్తారు గ్రామస్తులు. పక్క పట్నంలో ఒక పనికిమాలిన పత్రికకు విలేఖరిగా పనిచేసే వీరముష్టి రాఘవులు (వీరా) వాళ్ళకి సలహాదారు.

ఆగ్రా అనగానే తాజ్‌మహల్, మాడుగుల అనగానే హల్వా, కాకినాడ అనగానే కాజా జ్ఞాపకం వచ్చినట్లుగా నక్కబొక్కలపాడు అనగానే రారా, పోరా అనగా తమ గ్రామం జ్ఞాపకం వచ్చేట్టు ఏదైనా ఘనకార్యం చేసేసి ఒక కీర్తిమూట జన్మభూమికి ఇవ్వాలని వాళ్లు డిసైడైపోయారు.

అయితే ఏ ఘనకార్యం చెయ్యాలి?

పత్రికా విలేఖరి కాబట్టి వీరా వద్ద బోలెడు పుస్తకాలున్నాయి. అవికాక పంచాయితీ ఆఫీసుకి బోలెడు పత్రికలొస్తాయి. అవన్నీ నమిలి మింగేసిన రారా, పోరాల బుర్రలు విజ్ఞానంతో పేట్రేగి బద్దలయ్యే ప్రమాదాన్ని నివారించడం కోసం తలలు రిబ్బన్లతో బిగించి కట్టుకుంటారు వాళ్ళు. ఆ కట్టు కాస్త వదులు చేస్తే చాలు. ఆలోచనలు నోట్లోంచి తన్నుకొస్తాయి. రారా తలకట్టు వదులుచేసి "మనమేదైనా ఘనకార్యం చేసి గిన్నిస్ బుక్కులో దూరాలిరా" అన్నాడు గంభీరంగా.

గిన్నిస్‌బుక్ ఏమిటో అర్థంకాలేదు పోరాకి.

"అదేరా, గిన్నిస్ బుక్! ప్రపంచంలో ఏ మూల ఏ రికార్డు బద్దలైనా ఆ విషయం ఆ బుక్కులో ఎక్కిస్తారు" వివరించాడు రారా.

గ్రామఫోన్ రికార్డు బద్దలైతే ఆ బుక్కులో ఎక్కించవలసిన అవసరం ఏమిటని పోరాకి మరో సందేహం.

"రికార్డు అంటే గ్రామఫోన్ రికార్డు కాదురా!



కొత్త సినిమా కలక్షన్లు పాత వాటిని మించిపోతే పాతరికార్డు బద్దలై కొత్త రికార్డు స్థాపించింది అంటాం కదా. అలాగే అనేక రంగాల్లో పాత రికార్డులు బద్దలై కొత్తవి మొలుస్తూ ఉంటాయి" విసుక్కున్నాడు రారా.

"ఓహెూహెూ! అలాగా!" నోరెళ్లబెట్టాడు పోరా.

అయితే ఏ ఘనకార్యం చెయ్యాలని ఇద్దరూ ఘోరంగా ఆలోచించారు.

"హా! తట్టెన్! సెప్టెంబర్ 24 వరల్డ్ కిస్సింగ్ డే! ఒక జంట ఏకధాటిగా ఎనభై గంటల సుదీర్ఘ చుంబనంతో రికార్డు స్థాపించిన రోజు అది. ఆ రోజు ప్రపంచ వ్యాప్తంగా చుంబన పోటీలు జరుగుతాయి. మనం ఆ రికార్డు బద్దలు గొట్టడానికి ప్రయత్నిద్దాం" ఉత్సాహం ఉరిమింది రారాలో.



ముద్దంటే చేదా? ఎగిరి గంతేశాడు పోరా. అయితే అంతలోనే హంసపాదులాగ కూలబడ్డాడు. ముద్దుకి అంగీకరించే అమ్మాయి ఎక్కడ దొరుకుతుంది?

"హా! తట్టెన్!" అని మళ్లీ అరిచాడు రారా.

డబ్బు పారేస్తే చాలు ముద్దు ముచ్చట్లతో బాటు అన్నీ సమర్పించుకునే అమ్మాయిలు ఇసకపేటలో ఉంటారు.

రారా, పోరాలు డింగు డింగు మని ఇసుకపేట వెళ్ళి ఒక అనుభవజ్ఞురాలిని సంప్రదించారు. వాళ్లుత్తి ముడిసరుకు అని గ్రహించేసిందామె. "ఒరేయ్ సన్నాసుల్లారా! ముద్దు మధురమే గాని మోతాదు మించితే ఎంత స్వీటు అయినా హాట్‌హాట్‌గా మారి కాల్చేస్తుంది. నేనొక పట్టుపట్టి పీల్చేశానంటే చెరుకు పిప్పిలాగా అయిపోతారు జాగ్రత్త!" అంటూ సలహాకు గాను ఐదువందలు లాక్కుని మరీ వాళ్ళని తగిలేసింది.

మర్నాడు పంచాయితీ ఆఫీసులో పేపర్ చదువుతున్న రారాకి ఒక వార్త కనిపించింది. తాగుబోతు భర్తని పెళ్లాం పబ్లిగ్గా చెంపదెబ్బ కొడితే వెయ్యి రూపాయలు చొప్పున ఇస్తానని ఒక మంత్రిగారు ప్రకటించారట.

అంతెత్తున ఎగిరి గంతేసి ఉప్పొంగిపోతూ చెప్పాడు రారా "తాగుబోతుగా నటించి, పెళ్లాంగా ఒక అమ్మాయిని సెటప్ చేసుకొని ప్రపంచంలో ఎవరూ తిననన్ని చెంపదెబ్బలు కొట్టించుకుంటే అటు రికార్డు స్వంతమవుతుంది. ఇటు డబ్బుల మూట వస్తుంది."

"ఔనౌను! ఆ దెబ్బలకు పళ్లూడిపోయి, కళ్లు బైర్లు కమ్మి ప్రాణం పోవచ్చు" సందేహప్రాణి పోరా విశదీకరించాడు.

అదీ నిజమే. మరి రికార్డు సాధించడం ఎలా...?

రాత్రంతా ఆలోచిస్తూనే పడుకున్నాడు రారా.

హఠాత్తుగా 'హా! తట్టెన్!' మళ్లీ అరిచాడు రారా.

ఉదయాన్నే పక్క పట్నం వెళ్లి మందులషాపులో

**ప్రఫుల్లచంద్ర**

ఏవేవో మందులు బోలెడు కొని తెచ్చాడు. ఎందుకీ మందులని పోరా అడిగినా చెప్పలేదు. రికార్డు సాధించాక చెప్తా అని దాటవేశాడు.

ఒక రోజంతా శ్రమపడి ఇంటింటికీ తిరిగి మగ వాళ్ళని పక్కకి లాక్కుపోయి చెవిలో రహస్యంగా గుసగుసలాడి పరమ రహస్యంగా ఒక్కొక్కరి చేతిలో ఒక్కో మాత్ర పెట్టి దాన్ని ఎప్పుడు ఎలా వేసుకోవాలో వివరించాడు రారా.

ఈ మందులెందుకని పోరా పోరుతూనే ఉన్నాడు. రారా తప్పించుకుంటూనే ఉన్నాడు. 'రేపు తెల్లారేక తెలుస్తుందిలే' అన్నాడు చివరకు.

తెల్లవారింది.

ఊరి జనం చెంబులు పట్టుకొని కొందరు, చెంబులు లేకుండానే కొందరు హడావుడిగా, బిరబిరా, చరచరా గ్రామ శివారుకు పరుగులు తీసి పొలంగట్ల వెంబడి కొందరు, చెరువుదరి కొందరు హమ్మయ్యా అంటూ కూర్చున్నారు. వెళ్లేవాళ్లు వెళ్తున్నారు, వచ్చేవాళ్లు వస్తున్నారు. వెళ్లినవాళ్లు మళ్లీ మళ్లీ వచ్చి వెళ్తున్నారు.

రెండుగంటల పాటు అదొక నిరంతర యాత్ర! యాత్రికుల మొత్తం సంఖ్య మూడువేల ఐదువందల పన్నెండు!

చివరకు వాళ్లకి అర్థం అయింది రారా తమకిచ్చినది సుఖ విరేచనకారి మాత్ర అని! ఆ విషయం అర్థం అయాక గిన్నిస్‌బుక్కు లెవెల్లో వారిలో కోపం పెల్లుబికింది. 'ఈ మాత్ర వేసుకుంటే మంచం విరిగే లెవెల్లో విజృంభిస్తావు. ఇల్లాలు బ్రహ్మానందపడుతుంది' అని చెప్పి రారా వాళ్లకా మాత్రలిచ్చాడు మరి!

సుత్తులు, కొడవళ్లు, కర్రలు, గిన్నెలు, గునపాలు చేతికి ఏది చిక్కితే అది పట్టుకొని రారా వద్దకు భీకరంగా పరుగుతీసి అతడి మీద దాడిచేసి కసితీరా బాదేసి చివరకు చస్తాడేమోనని భయపడి వదిలేసి వెళ్లిపోయారు.

చాటుగా నక్కిన పోరా వాళ్లు వెళ్లగానే బయట కొచ్చి మిత్రుని ఓదార్చాడు. రికార్డు బద్దలు కొట్టేందుకే రారా ఈ పని చేశాడని అర్థమయిందతనికి.

"నువ్వు అనుకున్న రికార్డు బద్దలయిందో లేదో గాని ఇప్పుడే ఒక రికార్డు స్థాపించబడింది. మరోటి స్థాపించబడనున్నది" అంటూ రారా పట్నం నుంచి తెచ్చిన ఆయింట్‌మెంట్‌ని గాయాలకు రాస్తూ అన్నాడు పోరా.

అంత బాధలోనూ మిత్రుడు చెప్తున్న రికార్డులేమిటా అని ఆలోచనలో పడ్డాడు రారా.

"జమిలిగాను, విడివిడిగానూ కేవలం పది నిముషాల్లో వందమంది ఒకే వ్యక్తిని వివిధ ఆయుధాలతో వెయ్యిసార్లు బాదడం ఒక నయా రికార్డ్!" అంటూ పోరా నవ్వాడు. రారా కుయ్యో మొర్రో అన్నాడు.

"స్థాపించబడనున్న కొత్త రికార్డు ఏమిటి?" నీరసంగా అడిగాడు రారా.

"దెబ్బ తగిలితే ఎవరైనా పదిపదిహేను గ్రాముల ఆయింట్‌మెంట్ రాసుకుంటారు. నువ్వు పట్నం నుంచి యాభైగ్రాముల ట్యూబులు పది తెచ్చావు. ఇప్పటికి నీకు ఏడు ట్యూబుల ముద్ద పట్టించాను. మిగిలిన మూడూ పట్టిస్తే మొత్తం అరకిలో! ఒకేసారి ఇంత ఆయింట్‌మెంట్ పట్టించుకున్న నరమానవుడెవడూ లేడు! ఇదో రికార్డు కాబోతోంది" ముద్ద రుద్దుతూ అన్నాడు పోరా. ఏడుస్తూ నవ్వాడు రారా.

"ఎందుకిలా చేశావ్?" అనునయంగా అడిగాడు పోరా.

"ఒక కాల వ్యవధిలో ఒకే గ్రామంలోని అత్యధికులు బహిర్భూమికి వెళ్తే అదో కొత్త రికార్డు అవుతుందని..."

"ఓరి చచ్చు సన్నాసి వెధవన్నర వెధవ మిత్రమా! ఇదో ఘనకార్యమా?! విన్నవాళ్లు ఛీ కొట్టరా? ఇది మన గ్రామానికి కీర్తికాదు. నగుబాటు!" తిట్టి తిట్టి చివరి ట్యూబు ఆయిట్‌మెంట్ కూడా పట్టించి "ఇదిగో మరో రికార్డు బద్ధలైంది! మొత్తం అరకేజీ ఆయింట్‌మెంటు!" ముసిముసిగా నవ్వాడు పోరా.

మిత్రునికి దండ సన్మానం జరిగిందని తెలిసి అప్పుడే పట్నం నుంచి వచ్చిన వీరా అందుకున్నాడు "నువ్వింత చవటన్నర పావు వెధవవనుకోలేదురా రారా! రికార్డు బద్ధలుకొట్టాం అని చంకలు గుద్దుకుం




టే చాలదురా. డబ్బులు ఖర్చుపెట్టి గిన్నిస్‌బుక్ వాళ్లని రప్పించి రుజువులూ, సాక్ష్యాలూ చూపించాలి. నువ్వు చెంబుల్ని చూపించినా, మనుషుల్ని చూపించినా వాళ్లు నమ్మరు. ఈ పరిస్థితిలో గ్రామస్థులు సాక్ష్యం చెప్పరు సరికదా మరోసారి బడితపూజ చేస్తారు. అదీకాక ఇంతమంది బహిర్భూమికి పోయారని చెప్పుకుంటే దేశవిదేశాల్లో మన పరువు పోదా? తలవంపులు కాదా? నీకిలాంటి ఛండాలపు ఆలోచన ఎలా వచ్చిందిరా? నీ బుర్రే ఒక పెద్ద బహిర్భూమిలా ఉంది"

సలహాదారు వైపు కొరకొరా చూస్తూ "అలా ఎందుకు చెప్తాం? జనం సహజ ఎరువులు వేశారని చెప్తాం" గుర్రుగా అన్నాడు రారా.

"సాక్ష్యంగా వాళ్లకి సహజ ఎరువుల్ని చూపిస్తావా?" గొల్లు గొల్లున నవ్వేసి మిత్రుని నడ్డిమీద సన్నేహంగా చరిచాడు వీరా. అంతే ఆ దెబ్బకి రారాకి మైకం కమ్మింది. ఏం జరుగుతున్నదో తెలియలేదు ఓ క్షణం.

* * *

"బారెడు పొద్దెక్కింది. లేవరా ఎదవసచ్చినోడా!"

ఎవరో తనని కుదిపి కుదిపి లేపుతున్నట్లు అనిపించి లేచి కూర్చుని కళ్లు తెరిచాడు రారా... ఎదురుగా బామ్మ!

శరపరంపరగా మాటలు సంధిస్తోంది "ఆ పిచ్చి చూపులేమిట్రా ఎదవ సచ్చినోడా! కలలు కంటున్నావా? నిద్రపోతున్నావా?" ముఖం మీద నీళ్లు కొట్టింది.

రారా తేరుకొని చూశాడు. తన పక్కన వీరా, పోరా లేరు! ఒంటిమీద దెబ్బలు లేవు! నొప్పి లేదు! ఓస్, ఇదంతా కలా?!

"బారెడు పొద్దెక్కింది లేవరా, ఎదవసచ్చినోడా!"

బామ్మ నోటికి మరో తిట్టు రాదు!

ఆమెను తదేకంగా చూస్తూ "నిన్ను గిన్నిస్ బుక్‌లో దూర్చేయాలే బామ్మా! ఎదవసచ్చినోడా అని ఇంత వరకు నన్ను శతకోటి సార్లైనా తిట్టి ఉంటావు. అతి తక్కువ కాలంలో ఇన్నిసార్లు ఒకే తిట్టు ప్రయోగించిన వాళ్లు ప్రపంచం మొత్తంలో ఎవరూ ఉండరు. నువ్వు రికార్డు సాధించావే బామ్మా! మన గ్రామానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చేశావు!" హుషారుగా బామ్మని రెండు చేతుల్తోను ఒడిసిపట్టుకొని గిరగిరా తిప్పేశాడు రారా.

"నన్నొదలరా ఎదవసచ్చినోడా, వదలరా" అని బామ్మ మొత్తుకుంటూనే ఉంది. ●